క్లుప్తంగా

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

జమ్మలమడుగు: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం ఉదయం 11గంటలకు మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ అధ్యక్షతన జరుగుతుందన్నారు. వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కౌన్సిల్ సభ్యులందరూ తప్పకుండా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

వీరభద్రుడికి త్రిశూలం బహూకరణ



వీరభద్రుడిని త్రిశూలాన్ని అందజేస్తున్న వీరయ్య దంపతులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని బొగ్గుడుపల్లె రోడ్డులోని మిస్సమ్మ బంగ్లా సమీపంలో వెలసిన భద్రకాళి వీరభద్రస్వామికి ఆదివారం పంచలోహాలతో తయారు చేసిన త్రిశూలాన్ని బహూకరించారు. దేశి వీరయ్య, కుమారి దంపతులు త్రిశూలాన్ని ఆదివారం ఆలయ అర్చకులు బసవరాజులు అందజేశారు. అర్చకులు వీరభద్రునికి ప్రత్యేక పూజలు నిర్వహించి దాతలకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ప్రతిభ అవార్డుకు ఎంపిక



ప్రభాకర్

వేంపల్లె: ఏపీజే అబ్దుల్ కలాం నేషనల్ ప్రతిభ అవార్డుకు ఇడుపులపాయ ట్రిపుల్ ఐటి అధ్యాపకుడు విరూపాక్షి ప్రభాకర్ ఎంపికయ్యారు. ఎనిమిదేళ్లుగా కెమిస్ట్రీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఈయన పనిచేస్తున్నారు. ఆయన విధులను నిబద్ధతతో నిర్వహిస్తూ, పేద, మధ్యతరగతి విద్యార్థులను తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించారు. అందువల్ల ఆయనకు అవార్డు వచ్చిందని అధ్యాపకులు చెబుతున్నారు. అవార్డు రావడంతో ప్రభాకర్ హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 20న ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో అవార్డును ప్రదానం చేయనున్నారు.

భానుకోట క్షేత్రంలో పూజలు



భానుకోట క్షేత్రంలో ఐఏఎస్ భారతి హోల్కారి దంపతులు

సింహాద్రిపురం: మండలంలోని అహోబిలం గ్రామ సమీపంలో ఉన్న భానుకోట పుణ్యక్షేత్రంలో సోమశ్వరస్వామిని హైదరాబాద్‌కు చెందిన ఐఏఎస్ భారతి హోల్కారి ఆదివారం దర్శించుకున్నారు. ఆమె కుటుంబ సమేతంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకుడు దేవగుడి బద్రి శర్మ, ఆలయ నిర్వహణ అధికారి విశ్వనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

గుట్టను తవ్వేస్తున్నారు



కొత్తపల్లె గ్రామ సమీపంలో సదునుగా మారిన గుట్ట

పులివెందుల రూరల్: కొంతమంది ప్రభుత్వ భూముల నుంచి మట్టిని దర్జాగా తవ్వేస్తున్నారు. గుట్టలను యథేచ్ఛగా తొలిచివేస్తున్నారు. మండల పరిధిలోని కొత్తపల్లె గ్రామ సమీపంలోని మోట్నూతలపల్లె గ్రామానికి వెళ్లే దారిలో ఉన్న ఎదురుగుట్టను యథేచ్ఛగా తవ్వేస్తూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. గుట్ట ఉండడం వలన పశువులు, మేకల మేతకు అనుకూలంగా ఉంటుందని కొత్తపల్లె గ్రామస్తులు అంటున్నారు. కొందరు వ్యక్తులు ఎక్స్‌కవేటర్‌తో గుట్టను తొలిచి పంట భూములుగా తయారు చేసుకుంటున్నారని చెబుతున్నారు. గుట్టకు సంబంధించి ఎవరికీ ఎలాంటి అనుమతులు లేవని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుట్టలు ఆక్రమణలకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఆలయానికి రూ.5.50 లక్షలు విరాళం

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక మేదర వీధిలోని శ్రీ రామలింగ చౌడేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారి దూపదీప నైవేద్యాలకు మాజీ ఎన్జీఓ రాష్ట్ర అధ్యక్షుడు పీవీ రమణయ్య, అండ్ బ్రదర్స్ ఆధ్వర్యంలో రూ.5.50 లక్షలు విరాళం ఇచ్చారు. విశ్రాంత అధ్యాపకుడు పోసా కృష్ణయ్య, కుమారుడు డాక్టర్ పీవీ చంద్రశేఖర్, డాక్టర్ కవితా ప్రసన్నలు విజయ దశమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ మొత్తాన్ని ఆలయ అధ్యక్షుడు వుట్టి నాగశయనంకు అందజేశారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అధ్యక్షుడు శాలువ కప్పి పూలమాలతో సత్కరించి అమ్మవారి ప్రసాదం అందజేశారు. ఆలయ సెక్రటరీ గిద్దలూరు శ్రీనివాసులు, సభ్యులు వుట్టి లక్ష్మీనారాయణ, గొర్రె మల్లిఖార్జున, గిద్దలూరు ఈశ్వరయ్య, పాల్గొన్నారు.

సబ్సిడీ కోత.. బీమా ఎత్తివేత..!

- విత్తన శనగ రాయితీ తగ్గింపు
- బీమా ప్రీమియంపై చేతులెత్తేసిన ప్రభుత్వం
- కూటమి ప్రభుత్వంపై రైతాంగం మండిపాటు



యర్రగుంట్ల మండలంలో దుక్కి చేస్తున్న రైతు

ఎర్రగుంట్ల : కూటమి ప్రభుత్వం సబ్సిడీలో కోత విధించడంతో పాటు అరకొరగా శనగ విత్తనాలను సరఫరా చేసి రైతుల జీవితాలతో అటలాడుకుంటోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 40 శాతం సబ్సిడీతో రైతులకు విత్తన శనగలు అందించారు. ఈ ఏడాది రాయితీ 40 శాతం నుంచి 25 శాతానికి కూటమి ప్రభుత్వం తగ్గించడంపై అన్నదాతలు మండిపడుతున్నారు. రబీలో శనగ సాగుపై అన్నదాతలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఇప్పటికే పొలాల్లో సేద్యం పనులు పూర్తి చేయడంతో పాటు ఎరువులు వేసి విత్తనాల కోసం ఎదురు చూస్తున్నారు. యర్రగుంట్ల మండల పరిధిలో 10,200 ఎకరాల్లో శనగ పంట సాగు చేసే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

రైతుల ఆశలపై నీళ్లు

కూటమి ప్రభుత్వం రైతుల ఆశలపై నీళ్లు చల్లుతూ.. గతంలో 40 శాతంగా ఉన్న సబ్సిడీని ఈ ఏడాది 25 శాతానికి తగ్గించింది. దీంతో బహిరంగ మార్కెట్‌తో సమానంగా రైతు సేవా కేంద్రాల్లో ప్రభుత్వం అందించే శనగ విత్తనాల ధరలు ఉన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది క్వింటాకు శనగ ధర రూ.9,400 గానూ 25 శాతం సబ్సిడీ రూ.2,350 పోనూ రైతులు క్వింటాకు రూ.7,050 చెల్లించాలని నిర్ణయించారు. ఈ ధరతో కొంచం అటు ఇటుగా ప్రైవేటు మార్కెట్‌లో కూడా శనగ విత్తనాలు లభిస్తుండటంతో రైతు సేవా కేంద్రాలల్లోని పంపిణీ కేంద్రాల వద్ద రద్దీ తగ్గిపోయింది. యర్రగుంట్ల మండలంలో 4,500 క్వింటాళ్లు గాను.. 3,500 క్వింటాళ్లు మాత్రమే మంజూరు చేశారు.

రైతులే బీమా ప్రీమియం చెల్లించాలి?

ఈ ఏడాది రబీలో సాగు చేసే శనగ పంటతో పాటు ఇతర పంటలకు రైతులే బీమా ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఉచిత పంటల బీమాపై రాష్ట్ర ప్రభుత్వం చేతులెత్తేయడంతో పాటు ఆ భారాన్ని రైతులే భరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఈ క్రాప్ బుకింగ్ చేసుకుంటే.. వైఎస్సార్ ఉచిత పంటల బీమా కింద ప్రభుత్వమే ప్రీమియం చెల్లించేదని రైతులు గుర్తు చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి బీమా ప్రీమియం చెల్లించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రతిపాదనలు పంపాం



యర్రగుంట్ల మండలానికి ఇప్పటికి 3,500 క్వింటాళ్లు మంజూరు అయ్యాయి. రెండో విడత విత్తనాల కోసం ప్రతిపాదలు పంపాం. విత్తనాలు కోసం రైతుల వద్ద నుంచి వేలి ముద్రలు వేయించుకున్నాం. స్టాక్ వచ్చిన వెంటనే వారికి విత్తనాలు పంపిణీ చేస్తాం. అదనంగా విత్తనాలు సరఫరా చేయాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

–శ్రీకాంత్‌రెడ్డి, వ్యవసాయ అధికారి, ఎర్రగుంట్ల మండలం

ప్రభుత్వమే ప్రీమియం చెల్లించాలి



పంటల బీమా ప్రీమియంను ప్రభుత్వమే చెల్లించాలి. రైతులకు అవగాహన లేక ప్రీమియం సకాలంలో చెల్లించలేక నష్టపోయే అవకాశం ఉంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వైఎస్సార్ ఉచిత పంట బీమా చేసిన విధంగా ఈ ప్రభుత్వం కూడా ఈ క్రాప్ బుకింగ్ సమయంలో రైతుల ప్రీమియం చెల్లించి రైతులకు అండగా ఉండాలి.

హరిప్రసాద్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ వ్యవసాయ మార్కెట్ యార్డు, యర్రగుంట్ల

డిమాండ్ మేరకు పంపిణీ చేయాలి



రైతులను ఆదుకునేందుకు డిమాండ్ మేరకు సబ్సిడీ విత్తనాలు సరఫరా చేయాలి. ఖరీఫ్‌లో రైతులు పంటలు దెబ్బతిని తీవ్రంగా నష్టపోయారు. రబీలోనైనా శనగ ద్వారా చేసిన అప్పులు తీర్చుకునేందుకు అధికారులు అండగా నిలవాలి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హాయంలో రైతులకు సరిపడా విత్తనాలు అందించేవారు.

–మల్లు మోహన్‌రెడ్డి, ఉపమండలాధ్యక్షుడు, యర్రగుంట్ల మండలం

14 మద్యం షాపులకు 270 దరఖాస్తులు

ఎర్రగుంట్ల: యర్రగుంట్ల ఎక్సైంజ్ శాఖ పరిధిలో ఉన్న 14 మద్యం షాపులకు 270 దరఖాస్తులు వచ్చినట్లు యర్రగుంట్ల ఎక్సైంజ్ శాఖ సీఐ గోపికృష్ణ తెలిపారు. యర్రగుంట్ల పట్టణంలో 39 షాపుకు 25, 40 షాపుకు 21 , 41 షాపుకు 21 , 42 షాపుకు 22, 43 షాపుకు 22, రూరల్ పరిధిలోని 44 షాపుకు 27, 45 షాపుకు 28, 46 షాపుకు 29, కమలాపురం పరిధిలోని 47 షాపుకు 26, 48 షాపుకు 8, 49 షాపుకు 9, 50 షాపుకు 10 వల్లూరు పరిధిలోని 51 షాపుకు 6, వీరపునాయినిపల్లి మండల పరిధిలోని 52 షాపుకు 10 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు.

నేటి నుంచి పల్లె పండుగ

వీరపునాయునిపల్లె: మండలంలోని 22 పంచాయతీల్లో సోమవారం నుంచి పల్లె పండుగ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు మండల అభివృద్ధి అధికారి చంద్రమౌళీశ్వర్ తెలిపారు. సోమవారం అలిదెన, పాయసంపల్లె, ఇందుకూరు, మంగళవారం ఉరుటూరు, యు. వెంకటాపురం, తలపనూరు, బుధవారం వెల్దుర్తి, బసిరెడ్డిపల్లె, కొమ్మద్ది, గురువారం గంగిరెడ్డిపల్లె, యరమలపల్లె, మిట్టపల్లె, శుక్రవారం బుసిరెడ్డిపల్లె, యస్. పాలగిరి, మొయిళ్లచెరువు, శనివారం వీరపునాయునిపల్లె, అనిమెల, గోనుమాకులపల్లె, సోమవారం యస్. పాలగిరి, యు. రాజుపాలెం, తంగెడుపల్లె గ్రామాల్లో నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు హాజవుతారని తెలిపారు. మండల స్థాయి అధికారులు నివేదికలతో హాజరు కావాలని ఆయన కోరారు.

పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలి

జమ్మలమడుగు: జమ్మలమడుగు నియోజకవర్గం పారిశ్రామికంగా అభివృద్ధి కావాటానికి అన్ని రకాల ప్రకృతి వనరులు ఉన్నాయని, ప్రభుత్వాలు వాటిని సద్వినియోగంచేసుకుని ఈ ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.మనోహర్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విభజన చట్టంలో కడప జిల్లా ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి అనువైన స్థలమని చెప్పి ఇంతవరకు అమలు కాలేదని విమర్శించారు. స్థానిక ప్రజా ప్రతినిధులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉక్కు పరిశ్రమ నిర్మాణం కోసం ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. గండికోటను టూరిజం హబ్‌గా తీర్చిదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏసుదాసు, వినయ్, విజయ్, రాజు పాల్గొన్నారు.

శిల్పారామంలో దసరా సంబరాలు

పులివెందుల టౌన్ : శిల్పారామంలో దసరా సంబరాలు రెండురోజులుగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన చిన్నారుల నృత్య ప్రదర్శనలు అలరించాయి. దసరా సంబరాలు చివరి రోజు ఆదివారం యువరాజా డ్యాన్సింగ్ స్కూల్, యువకిషోర్ మాస్టర్ ఆధ్వర్యంలో కోలాటం, జానపద, సినీ పాటలకు నృత్యాలతో ప్రేక్షకులను ఎంతగానో అలరించింది. పాటకు తగ్గ అభినయం, హావభావాలతో సందర్శకులకు ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఏఓ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే వైఎస్సార్ ఉలిమెల్ల లేక్ ఫ్రంట్‌లో దసరా సంబరాలు ఘనంగా ముగిశాయి. మాస్టర్ బి. రాజు, శ్రీ రాజా కళా నిలయం వారి చిన్నారుల జానపద మరియు సినీ పాటలకు నృత్యాలు సందర్శకులను అబ్బురపరిచాయి. ఏఓ సుధాకర్ పర్యవేక్షించారు.



వైఎస్సార్ లేక్‌ఫ్రంట్‌లో చిన్నారుల నృత్యాలు



శిల్పారామంలో చిన్నారుల శాస్త్రీయ నృత్యప్రదర్శన

వధూవరులకు ఆశీర్వాదం

పెండ్లిమర్రి: మండలంలోని కొత్తగిరియంపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ సుబ్బిరెడ్డి కుమారుడు సురేంద్రారెడ్డి వివాహాన్ని ఆదివారం కొత్తగిరియంపల్లె ఘనంగా నిర్వహించారు. వివాహానికి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి హాజరయ్యారు. అలాగే వెల్లటూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు గంగిరెడ్డి గారి చెన్నారెడ్డి కుమారుడు శివ శంకర్‌రెడ్డి వివాహంలో రవీంద్రనాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్‌రెడ్డి, మండల కన్వీనర్ రమణారెడ్డి పాల్గొన్నారు.



వధూవరులను ఆశీర్వదిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి

రోడ్లపై చెత్త, వ్యర్థాలు వేస్తే చర్యలు

బద్వేలు అర్బన్ : పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో గల దుకాణదారులు రోడ్లపై చెత్త, వ్యర్థాలు వేస్తే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ సాయంత్రం వేళల్లో చెత్తసేకరణ వాహనాలను ప్రధాన రహదారుల్లో తిప్పుతున్నామని, అందులో మాత్రమే చెత్త వేయాలని కోరారు. ఇప్పటికే నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపై చెత్త వేసిన వారికి జరిమానా విధించడం జరిగిందని తెలిపారు. పట్టణ పరిశుభ్రతకు ప్రతిఒక్కరు సహకరించాలని కోరారు.

ఖాళీ జాగాలు శుభ్రపరుచుకోవాలి

మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో ఉన్న ఖాళీ జాగాల్లో పెరిగిన కంపచెట్లను ఈ నెలాఖరులోపు సంబంధిత యజమానులే శుభ్రపరుచుకోవాలని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి కోరారు. ఇప్పటికే సంబంధిత యజమానులకు ఆదేశాలు ఇచ్చామని, ఈ నెలాఖరులోపు శుభ్రపరుచుకోకుంటే మున్సిపల్ సిబ్బందితో శుభ్రం చేయించి అందుకు అయ్యే ఖర్చుకు రెండింతలు సంబంధిత స్థల యజమానుల నుండి వసూలు చేయడం జరుగుతుందని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి



ద్రవ జీవామృతాన్ని పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయ అధికారులు

వల్లూరు (చెన్నూరు) : ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడి సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎస్.ప్రవీణ్ కుమార్ తెలిపారు. చెన్నూరు మండలం కనపర్తి గ్రామానికి చెందిన రైతు దండు బోయిన బాలచంద్ర, బలసింగాయపల్లె గ్రామాలలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులలో సాగు చేస్తున్న పసుపు పంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్నిహోత్రంతో పాటు ద్రవ జీవామృతం, పండ్ల రసం ద్రావణం, బ్యాక్టీరియా కల్చర్, అనుజలం, పంచగవ్య, కవచ్, ఆవాల పిండి మరియు సైంధవ లవణం, సున్నం వంటి పదార్థాలను వాడాలని సూచించారు. ఈ వినూత్న వ్యవసాయ పద్ధతులతో తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడులు వస్తాయని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో బద్వేలు వ్యవసాయ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.నాగరాజ, అధికారులు పాల్గొన్నారు.

సాహితీ పరిశోధకుడిగా 'బంగోరె' ప్రత్యేక ముద్ర

కడప కల్చరల్ : సాహితీ పరిశోధకుడిగా బంగోరె పేరుతో బండి గోపాల్‌రెడ్డి ప్రత్యేక ముద్ర సాధించారని వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. కడప రాజీవ్ కల్చరల్ క్లబ్‌లో బండి గోపాల్‌రెడ్డి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి వేసి నివాళులర్పించారు. మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ వేమన, సీపీ బ్రౌన్, గురజాడల సాహిత్య జీవితాలపై లోతైన పరిశోధనలు చేశారని తెలిపారు. కవి డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి మాట్లాడుతూ బంగోరె తెలుగు భాషకు చేసిన సేవలు కీలకమైనవన్నారు. ఈ కార్యక్రమంలో కల్లూరు బాల యల్లారెడ్డి, సత్యనారాయణ, రెడ్డయ్య, బాల ఓబయ్య, తదితరులు పాల్గొన్నారు.



బండి గోపాల్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జిల్లా రచయితల సంఘం ప్రతినిధులు

భక్తిశ్రద్ధలతో కుమారిపూజ

కడప కల్చరల్ : కడప నగరం బిల్టప్ సమీపంలోని ఆచార్ల కాలనీలో వెలసిన జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో విజయదశమిని పురస్కరించుకుని శనివారం కుమారిపూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కాశీ నుంచి వచ్చిన శ్రీ బ్రహ్మనందగిరిస్వామి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. 4 నుంచి 9 ఏళ్ల బాలికలను అమ్మవారి స్వరూపాలుగా భావించి ఈ పూజలో కూర్చోబెట్టారు. వారికి అమ్మవారి వేషధారణ వేయించారు. వారి కాళ్లను శ్రీ బ్రహ్మనందగిరి స్వామి కడిగి, పుష్పాలతో అర్చించారు. వారి కాళ్లు తలకు తాకించుకుని, దీపారాధన చేశారు. ఈ కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుని, ఆలోపింపచేసింది. ఈ సందర్భంగా శ్రీ బ్రహ్మనందగిరిస్వామి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మహిళలపై అత్యాచారాలు, హత్యాచారాలు పెరిగిపోయాయని తెలిపారు. చిన్నారులను కూడా కొందరు చెరపడుతున్న వార్తలు మనం చూస్తునే, వింటూనే ఉన్నామని పేర్కొన్నారు. వీటిని అరికట్టేందుకు స్త్రీ మూర్తిపై గౌరవ భావం పెంచడమే సరైన మార్గమని పేర్కొన్నారు. పురాణాలు, ఇతిహాసాల్లోనూ మహిళలకు ఉన్నతమైన స్థానం కల్పించారని చెప్పారు. స్త్రీలను గౌరవించడం ప్రాచీన కాలం నుంచి వస్తున్న సంప్రదాయంలో భాగమన్నారు. ఈ మధ్యన ఈ విధానం కొంత గాడి తప్పిందన్నారు. మళ్లీ పునరుద్ధరించాల్సిన అవసరముందన్నారు. ఇందుకోసం సరైన అవగాహన కల్పించడమే మార్గమని పేర్కొన్నారు. 4 నుంచి 9 ఏళ్ల బాలికలది అన్నెం పుణ్యం ఎరుగని వయసు కాబట్టి.. వారిని అమ్మవారిగా భావించి పూజ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని స్ఫూర్తిగా తీసుకుని, కొందరైనా మారుతారని తాను ఆశిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.



బాలికల పాదాలు తలకు తాకించుకుంటున్న శ్రీ బ్రహ్మనందగిరిస్వామి

ఒంటరి తనం శాపం కారాదు

ప్రొద్దుటూరు కల్చరల్: వృద్ధాప్యంలో ఒంటరితనం శాపం కారాదని, వారికి అండగా నిలిచేందుకు ప్రభుత్వం హెల్ప్‌లైన్ ఏర్పాటుచేయాలని పుస్తక రచయిత ఎం.ప్రభాకర్ పేర్కొన్నారు. స్థానిక ఎన్జీఓ హోంలో ఆయన రచించిన వృద్ధాప్యం.. రెండవ బాల్యం పుస్తకాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ వృద్ధులకు ప్రభుత్వమే ఆశ్రమాలు ఏర్పాటు చేయాలని కోరారు. రఘురామిరెడ్డి, ఈశ్వరరెడ్డి, సుధాకర్, పెంచలయ్య, రెడ్డెన్న, కవులు, కళాకారులు పాల్గొన్నారు.

దేవీ వైభవం

- కన్నుల పండువగా గ్రామోత్సవం
- ముగిసిన దసరా ఉత్సవాలు

పులివెందుల టౌన్ : పట్టణంలోని అమ్మవారి ఆలయాలలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురష్కరించుకుని శనివారం వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో వాసవీ మాత, అంకాలమ్మ ఆలయంలో అంకాలమ్మ అమ్మవారు విజయలక్ష్మిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే పార్నపల్లె రోడ్డులోని సాయిబాబా ఆలయంలో స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేసి కాయకర్పూరం సమర్పించారు. ఆలయ చైర్మన్ నాగేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో అంకాలమ్మ అమ్మవారు గ్రామోత్సవాన్ని కేరళ వాయిద్యాల మధ్య వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం వసంతాలు నిర్వహించారు. రాత్రి అమ్మవారి పాన్పు సేవ కార్యక్రమంతో దసరా ఉత్సవాలు ముగిశాయి.

ముగిసిన దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు

కమలాపురం: అమ్మవారిశాలలో శ్రీ మత్కన్యకాపరమేశ్వరీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారు విజయదశమి (గ్రామోత్సవం) అలంకారంలో దర్శనమిచ్చి భక్తులను కనువిందు చేశారు. కామిశెట్టి వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు అమ్మవారి అలంకారానికి దాతలుగా వ్యవహరించగా కీ.శే. భోజనపాటి వెంకట సుబ్బయ్య కుటుంబ సభ్యులు అమ్మవారికి పట్టు చీర సమర్పించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజామున వరకు ఊరేగించారు. ఆదివారం అమ్మవారికి భక్తి శ్రద్ధలతో పాన్పు సేవ (వసంతోత్సవం) నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక వాహనంలో అలంకరించి పట్టణంలోని పలు వీధులలో వసంతోత్సవం నిర్వహించారు.

వైభవంగా విజయదశమి

ముద్దనూరు: శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. స్థానిక శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు నవరాత్రుల్లో వివిధ అలంకారాలలో దర్శనమిచ్చారు. శనివారం అమ్మవారు శమీదర్శనం, గ్రామోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలతో ఉత్సవాలు ముగిశాయి.



ఎర్రగుంట్ల: అమ్మవారి పల్లకి మోస్తున్న మహిళలు

వేంపల్లెలో..

వేంపల్లె : వేంపల్లెలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో శనివారం అమ్మవారు బంగారు చీరలో దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, నైవేద్యం, మంత్రపుష్పం, మహా మంగళహారతి తదితర పూజలు నిర్వహించి బంగారు చీరతో అలంకరించారు. సాయంత్రం శ్రీ వాసవి కల్యాణ మండపం ఆవరణలో శమీదర్శనంలో శ్రీ విజయలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. రాత్రి శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవి పాన్పుసేవతో దసరా ఉత్సవాలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా దసరా వేడుకలు

జమ్మలమడుగు: పట్టణంలో వైభవంగా దసరా వేడుకలు నిర్వహించారు. ఈ నెల 3వ తేదీ ప్రారంభమైన ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ప్రముఖ ఆలయాలైన శ్రీ కన్యకాపరమేశ్వరి, అంబ భవాని, నాగుల కట్టలోని చౌడేశ్వరి దేవి ఆలయాల్లో ప్రతి రోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజాము నుంచి తొగటవీర క్షత్రియుల ఆధ్వర్యంలో చౌడేశ్వరి దేవి జ్యోతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామునుంచి అమ్మవారి జ్యోతులను నెత్తిన పెట్టుకుని ప్రత్యేక కీర్తనలు పాడుకుంటూ చేసిన నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : శరన్నవరాత్రుల మహోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. తొమ్మిది రోజులు జరిగిన ఈ ఉత్సవాలలో అమ్మవారు వివిధ రూపాలలో భక్తులకు దర్శనం ఇచ్చారు. శమీ వృక్ష దర్శనంతో ఉత్సవాలు ముగిశాయి. శనివారం సాయంత్రం అమ్మవారు గ్రామోత్సవం పట్టణంలోని వైభవంగా జరిగింది. శ్రీ వాసవి కన్యాకపరమేశ్వరి ఆలయంలో, శ్రీ ఏరువాక గంగమ్మతల్లి ఆలయంలో గ్రామోత్సవం నిర్వహించారు.



జమ్మలమడుగు: జ్యోతి నెత్తిన పెట్టుకుని నృత్యం చేస్తున్న భక్తులు



ముద్దనూరు: గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు



వేంపల్లె: పులివాహనంపై వాసవీ కన్యకాపరమేశ్వరి



కమలాపురం: విజయలక్ష్మి అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారు



పులివెందుల టౌన్: గ్రామోత్సవంలో ప్రత్యేక అలంకారంలో వాసవీ మాత